సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025



యథేచ్ఛగా చెట్ల నరికివేత!

అటవీ ప్రాంతంలో ఇష్టా రీతిన చెట్లను నరికివేస్తున్నారు. కలప అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. 8లో▸



సాంస్కృతిక సారథికి..

కందుకూరు మండలం తిమ్మాపూర్‌కు చెందిన ప్రజా జానపద గాయకుడు ప్రభాకర్ నంది అవార్డు అందుకున్నారు. 8లో▸



డివైడర్‌ను ఢీకొన్న బస్సు

ప్రైవేటు పాఠశాల బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ఓ విద్యార్థి, ఆయమ్మ, డ్రైవర్ గాయపడ్డారు. 8లో▸

న్యూస్‌రీల్

ప్రజాస్వామ్యంలో దాడులు మంచివి కావు

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



అర్చకుడు రంగరాజన్‌ను పరామర్శించి మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

మొయినాబాద్: ప్రజాస్వామ్యంలో దాడులు చేయడం మంచి పద్ధతి కాదని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో సోమవారం ఆమె చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చి అర్చకుడు రంగరాజన్‌ను పరామర్శించారు. జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రంగరాజన్ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇలాంటి ఘటనలను మొదట్లోనే తుంచి వేయకపోతే ప్రమాదమని.. అందుకే దాడి చేసినవారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ ఘటనలో 26 మంది ఉన్నారని.. ఇప్పటికే ప్రధాన నిందితుడితో పాటు మరో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఒకటి రెండు రోజుల్లో అందరినీ అరెస్టు చేస్తామని వెల్లడించారు. పోలీసులు ఈ విషయమంలో సమర్థవంతంగా పనిచేస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

స్వామి దేవ్ నారాయణ్ మందిర్ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న సచిన్ పైలట్

అబ్దుల్లాపూర్‌మెట్ : మండల పరిధిలోని కవాడిపల్లి గ్రామంలో రాజస్థాన్ గుజ్జర్ సమాజ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన స్వామి దేవ్ నారాయణ్ మందిర్‌ను సోమవారం రాజస్థాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, నిర్వాహకులు, గుజ్జర్ సమాజ్ ప్రముఖులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో నిలిచిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

మున్సిపాలిటీగా పేరు మార్చే కారణమంటున్న అధికారులు

చేవెళ్ల: నియోజకవర్గంలో ఇటీవల కొత్తగా ఏర్పడిన చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాలకు సంబంధించి ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. సోమవారం చేవెళ్ల సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద విలీన గ్రామాలకు సంబంధించి మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతోంది.. రెండు రోజుల తరువాత విలీన గ్రామాల రిజిస్ట్రేషన్లు చేసుకోవడం మంచిదని ప్రకటన ప్రదర్శించారు. మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చిన తరువాత కూడా జీపీల పేరుపై రిజిస్ట్రేషన్లు చేస్తే భవిష్యత్తులో మ్యుటేషన్లకు ఇబ్బందులు ఎదురవుతాయని, అలా జరగకూడదనే ఉద్దేశంతో తాత్కాలికంగా రిజిస్ట్రేషన్లు నిలిపివేసినట్టు సబ్‌రిజిస్ట్రార్ వెంకటరమణ స్పష్టం చేశారు. రెండు రోజులు ఆగిన తరువాత ప్లాన్ చేసుకోవడం మంచిదన్నారు. తప్పనిసరి చేయాలని కోరితే జీపీల పేరుతో సైతం రిజిస్ట్రేషన్లు చేస్తున్నామని, ముందుగా సమాచారం ఇవ్వడం జరుగుతుందన్నారు. గురువారం నుంచి మున్సిపాలిటీ పేరుపై రిజిస్ట్రేషన్లు జరుగుతాయిని వెల్లడించారు. తహసీల్దార్ కార్యాలయంలో మాత్రం ఏ నిబంధనలు లేకుండా యథావిధిగా రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

నిలోఫర్‌లో మల్టీపారామీటర్ ప్రారంభం

నాంపల్లి: నవజాత శిశువుల మరణాల సంఖ్యను అరికట్టడానికి ఎంతగానో దోహదపడే మల్టీపారామీటర్‌ను నిలోఫర్ ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ పరికరాన్ని సోమవారం నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ ప్రారంభించారు. ఈ పరికరం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో శివుల్లోని హృదయ స్పందన రేటు, శ్వాసకోశ రేటు, రక్తపోటు, ఆక్సిజన్ స్థాయిలు వంటి ముఖ్యమైన సంకేతాలను పర్యవేక్షించడానికి ఉపయోగపడుతుంది. రక్తహీనత ఉన్న పిల్లల్లో హిమోగ్లోబిన్ స్థాయిలను పర్యవేక్షించడానికి దోహదపడుతుంది. తద్వారా పిల్లలకు సోకిని ఇన్‌ఫెక్షన్‌ను పూర్తిగా తగ్గించడమే కాకుండా మెరుగైన వైద్యాన్ని అందించడానికి ఉపకరిస్తుందని సూపరింటెండెంట్ పేర్కొన్నారు.

'కాసు'పత్రులు!

రోగుల బలహీనతలను 'సొమ్ము' చేసుకుంటున్న ఆస్పత్రులు



- వైద్య పరీక్షలు, చికిత్సల పేరుతో నిలువు దోపిడీ
- అయినా నిర్లక్ష్యంతో పలువురి మృత్యువాత
- హాస్పిటళ్ల వద్ద బంధువుల ఆందోళనలు
- అడ్డగోలు చికిత్సలపై ఆరోగ్య మంత్రి సీరియస్
- వరుస ఘటనలతో అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ



కడప జిల్లాకు చెందిన సుహాసిని ఫిట్స్‌తో బాధపడుతూ అపస్మారక స్థితిలోకి చేరడంతో చికిత్స కోసం గతనెల 12న మదీనాగూడలోని సిద్ధార్థ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు ఆమెను 28 రోజులుగా వెంటిలేటర్‌పైనే ఉంచి చికిత్స అందించారు. ఇప్పటి వరకు రూ.16 లక్షల బిల్లు వేయగా, రూ.11 లక్షలు చెల్లించారు. అయినా ఆరోగ్యం మెరుగుపడక పోగా మరింత క్షీణించి మృతి చెందింది. డబ్బుకు ఆశపడిన ఆస్పత్రి వైద్యులు మృతదేహానికి రెండు రోజుల పాటు వైద్యం చేసినట్లు బంధువులు ఆరోపించారు. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సీరియస్ అయ్యారు. ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు సోమవారం ఆస్పత్రికి చేరుకుని కేపీట్ సహా చికిత్సకు సంబంధించిన వివరాలు సేకరించారు. తాత్కాలికంగా ఆపరేషన్ థియేటర్‌ను సీజ్ చేశారు.

తుర్కయంజాల్ మున్సిపాలిటీ శ్రీరామ్‌నగర్‌కు చెందిన జి.సత్యంగౌడ్(46) తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ శనివారం ఉదయం చికిత్స కోసం అదే ప్రాంతంలోని యంజాల్ ఆస్పత్రిలో చేరాడు. పరీక్షించిన డ్యూటీ డాక్టర్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రెండు గంటల్లో రికవరీ అవుతాడని చెప్పారు. తీరా ఆదివారం ఉదయం పరిస్థితి విషమించి మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని ఆరోపిస్తూ బంధువులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తాజాగా సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆస్పత్రికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

సైదాబాద్ మాదన్నపేటరోడ్‌లోని అరుణ, జనని సహా కొత్తపేటలోని అలకనంద ఆస్పత్రుల్లో గుట్టుగా కిడ్నీ మార్పిడి చికిత్సలు చేస్తున్న విషయం తెలిసిందే. కర్ణాటక, తమిళనాడు నుంచి దాతలు, స్వీకర్తలను రప్పించి గుట్టుగా చికిత్సలు చేస్తున్న విషయం తెలిసిందే. ఒక్కో చికిత్సకు రూ.60 లక్షల చొప్పున వసూలు చేసినట్లు తేలింది. 2023 ఏప్రిల్ నుంచి 2024 జూన్ వరకు అరుణ, జనని ఆస్పత్రుల్లో, డిసెంబర్ నుంచి జనవరి 20 వరకు అలకనంద ఆస్పత్రిలో 20కిపైగా కిడ్నీ మార్పిడి చికిత్సలు చేసినట్లు వెల్లడైంది. పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపగా, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆస్పత్రిని సీజ్ చేశారు.

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఒకప్పుడు వైద్యులు వైద్యాన్ని సేవగా భావించి ఆస్పత్రులు ఏర్పాటు చేసేవారు. అవసరమైతే ఉన్నదంతా అమ్ముకుని రోగులకు సేవలు అందించేవారు. ప్రస్తుత పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా మారింది. వైద్య రంగం ప్రస్తుతం పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. దేశీయ సంస్థలే కాకుండా విదేశీ కంపెనీలు సైతం ఈ రంగంలో పెట్టుబడులు పెడుతున్నాయి. ఇప్పటికే హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని మెజార్టీ ఆస్పత్రులు విదేశీ సంస్థల గుప్పిట్లోకి వెళ్లిపోయాయి. విదేశాల్లో కూర్చొని, పూర్తి సీసీ కెమెరాల నిఘాలో అవుట్‌పేషంట్, ఇన్‌పేషంట్ విభాగాలు సహా డయాగ్నోస్టిక్ సెంటర్లు, ఫార్మసీ, ఆపరేషన్ థియేటర్లను ఆపరేట్ చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న ఆర్ఎంపీలకు, అంబులెన్స్ డ్రైవర్లకు కమీషన్ల ఆశచూపి రోగులను చేర్పించుకుంటున్నాయి. చికిత్సల పేరుతో వైద్యులకు టార్గెట్లు ఇచ్చి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నాయి. రోగులు, వారి బంధువుల్లో ఉన్న భయాన్ని 'క్యాష్' చేసుకుంటున్నాయి. తీరా రోగులు కోలుకోకపోగా, మృత్యువాతపడుతుండటంతో బంధువులు ఆస్పత్రుల ఎదుట ఆందోళనలకు దిగుతున్న ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి. మొన్న కొత్తపేటలోని అలకనంద ఆస్పత్రిలో కిడ్నీ రాకెట్.. నిన్న ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్‌లో ఓ ఆర్ఎంపీ అబార్షన్లు చేస్తున్న విషయం బహిర్గతమైంది. తాజాగా మదీనాగూడలో మృతదేహానికి చికిత్స చేసిన ఉదంతం వెలుగు చూసింది.

ఏకకాలంలో దాడులకు యాక్షన్‌ప్లాన్

వరుస ఘటనలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. జిల్లా వ్యాప్తంగా 2,300 వరకు స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ, జనరల్ నర్సింగ్‌హోమ్స్, ఐ, డెంటల్, స్కిన్ కేర్ క్లినిక్స్, డయాగ్నోస్టిక్స్ ఉన్నట్లు అంచనా. వీటిలో 350 నుంచి 400 క్లినిక్‌లకు ఎలాంటి అనుమతులు లేనట్లు సమాచారం. బాలాపూర్, సరూర్‌నగర్, హయత్‌నగర్ మండలాల పరిధిలోని ప్రైవేటు ఆస్పత్రులు/క్లినిక్‌లలో ఆకస్మిక తనిఖీలకు రంగం సిద్ధం చేసింది. ఇందుకోసం 30 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఏకకాలంలో అన్ని ఆస్పత్రుల్లో తనిఖీలు చేపట్టి, అనుమతులు, వైద్య సిబ్బంది విద్యార్హతలు, సాంకేతిక పరికరాల పనితీరు, రికార్డుల నిర్వహణ, శానిటేషన్, బయోమెడికల్ వేస్టేజ్ ప్లాంట్లను పరిశీలించనుంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వాటిని గుర్తించి చర్యలు తీసుకోనుంది. ఈ మేరకు కలెక్టర్ నారాయణరెడ్డిని అనుమతి కోరగా ఆయన గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. వైద్య ఆరోగ్యశాఖ బృందాలు తనిఖీలు చేపట్టనున్న విషయం తెలిసి కొంత మంది తమ క్లినిక్‌లను తాత్కాలికంగా మూసి వేస్తున్నట్లు తెలిసింది.

వాటి అనుమతులు రద్దు చేయాలి

చిన్న ఆరోగ్య సమస్యతో బాధపడుతూ ఆస్పత్రికి చేరుకుంటే చాలు వైద్య పరీక్షలు.. చికిత్సల పేరుతో నిలువుదోపిడీకి పాల్పడుతున్నాయి. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు చట్టానికి విరుద్ధంగా చికిత్సలు చేస్తున్నాయి. రోగుల మృత్యువాతకు కారణమవుతున్న ఆస్పత్రుల అనుమతులను రద్దు చేయాలి.

– డాక్టర్ జగన్‌గౌడ్, ప్రైవేటు ఆస్పత్రి బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న కేటీఆర్

'స్థానిక' ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే గెలుపు

మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మొయినాబాద్‌రూరల్: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే గెలుపని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కొడంగల్ నియోజకవర్గం కోస్గిలో సోమవారం రైతు దీక్షకు వెళ్తున్న ఆయన హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఆగి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కలిసి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలోమాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, పార్టీ యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మంజుల, శ్రీహరియాదవ్, షాబాద్ దర్శన్,స్వప్న, జీవంతు, జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

చేవెళ్లలో పార్టీ జెండా ఆవిష్కరణ

చేవెళ్ల: కోస్గిలో రైతు నిరసన దీక్షకు వెళ్తున్న కేటీఆర్‌కు మండల కేంద్రంలో పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. షాబాద్ చౌరస్తాలో ఆగిన ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సీఎం సీఎం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, పార్టీ యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

భాస్కర ఆస్పత్రిలో చికిత్స

మొయినాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మొయినాబాద్‌లోని భాస్కర ఆస్పత్రిలో ట్రీట్‌మెంట్ తీసుకున్నారు. కొడంగల్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన చేతి వేలికి చిన్న గాయమైంది. కార్యక్రమం ముగించుకుని హైదరాబాద్‌కు వెళ్తూ మార్గ మధ్యలో మొయినాబాద్‌లోని భాస్కర ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నారు. వైద్యులు గాయాన్ని పరిశీలించి, శుభ్రం చేసి ఇన్‌ఫెక్షన్ కాకుండా టీటీ ఇంజక్షన్ ఇచ్చారు. అనంతరం ఆయన నగరానికి వెళ్లారు. ఆయన వెంట మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, స్థానిక నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, కొత్త నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

రంగరాజన్‌పై దాడి అమానుషం



రంగరాజన్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి జరగడం దారుణమని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కే తారక రామారావు అన్నారు. సోమవారం ఆయన రంగరాజన్‌ను పరామర్శించారు. దాడికి సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయని, అందుకు రంగరాజన్‌పై జరిగిన దాడే నిదర్శనమన్నారు. దాడికి పాల్పడ్డ వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది అభిమానులను ఉండి, చిలుకూరు బాలాజీ సేవలో నిమగ్నమైన రంగరాజన్, సౌందరరాజన్ కుటుంబ పరిస్థితే ఇలా ఉంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన వారు ఏ ముసుగులో ఉన్నా కఠినంగా శిక్షించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే రంగరాజన్ కుటుంబానికి భద్రత కల్పించాలని కోరారు. సౌందరరాజన్, రంగరాజన్ కుటుంబానికి తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రులు సబితారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కార్తీక్‌రెడ్డి, కొంపల్లి అనంతరెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు విదేశీ ప్రామాణిక పాఠాలు

- అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి



అబిస్ ఇనిస్టూట్ ఆఫ్ కాస్మోటిక్ సైన్స్ సంస్థ ప్రతినిధులతో డాక్టర్ రవీందర్‌రెడ్డి

షాద్‌నగర్: ప్రభుత్వ కళాశాలల్లో చదివే పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆన్‌లైన్ పాఠాలు బోధించేందుకు అబిస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్మోటిక్ సైన్స్ సంస్థ ముందుకు వచ్చినట్లు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల సింగపూర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు షాద్‌నగర్ పట్టణానికి చెందిన అయన హాజరయ్యారు. సదస్సు ముగించుకొని వచ్చిన ఆయన సోమవారం వివరాలు వెల్లడించారు. షాద్‌నగర్ పట్టణంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాజేంద్రనగర్, షాద్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదివే పేద విద్యార్థులకు భవిష్యత్తులో ఉపాధి పొందే విధంగా ఆన్‌లైన్ కోర్సులు నేర్పించాలని సెమినార్‌కు విచ్చేసిన వివిధ సంస్థల ప్రతినిధులను కోరినట్లు తెలిపారు. ఆయా కళాశాలలతో ఎంఓయూ కుదుర్చుకునేందుకు ఫ్రాన్స్‌లోని యూరోపియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ సహకారంతో మహారాష్ట్రలోని నాసిక్ కేంద్రంగా పని చేస్తున్న అబిస్ ఇనిస్టూట్ ఆఫ్ కాస్మోటిక్ సైన్స్ సంస్థ ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఒప్పందం పూర్తయితే రాష్ట్రంలో మొదటి కళాశాలలు ఈ ప్రాంతానికి చెందినవే అవుతాయని పేర్కొన్నారు.

'ప్రజావాణి'కి ప్రాధాన్యత

కలెక్టర్ నారాయణరెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న, కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: వివిధ సమస్యలపై ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తామని, సత్వర పరిష్కారానికి చొరవ తీసుకుంటామని కలెక్టర్ సి. నారాయణరెడ్డి పేర్కొన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌ఓ సంగీతతో కలిసి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ వారం 67 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. వాటిని సంబంధిత అధికారులకు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూదాన్ భూములను నిషేధిత జాబితాలో చేర్చండి

నందిగామ: భూదాన్ బోర్డు ద్వారా నిరుపేదలకు గతంలో ప్రొసీడింగ్‌లు ఇచ్చిన భూములు అన్యాక్రాంతం కాకుండా, పట్టా మార్పిడి కాకుండా ఉండేందుకు నిషేధిత జాబితాలో చేర్చాలని నందిగామకు చెందిన భూదాన్ భూ బాధితులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. నందిగామ శివారులోని సర్వే నంబర్ 990లో 1975లో 18 మంది రైతులకు సుమారు 60 ఎకరాలను భూదాన్ బోర్డు ద్వారా ప్రొసీడింగ్‌లు ఇచ్చారు. కొంత మంది నకిలీ ఓఆర్‌సీలు సృష్టించి రికార్డుల్లో తమ పేర్లు నమోదు కాకుండా చేశారని చెప్పారు. భూదాన్ బోర్డు ద్వారా తమకు సంక్రమించిన ప్రతి ఆధారం తమ వద్ద ఉందని కలెక్టర్‌కు వివరించినట్లు తెలిపారు. ఈ భూములకు సంబంధించి న్యాయస్థానంలో కేసు కొనసాగుతోందని, పోలీస్ స్టేషన్‌లో సైతం కేసు ఉందని, పట్టా మార్పిడి కాకుండా నిషేధిత జాబితాలో చేర్చాలని వారు విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందించిన వారిలో రైతులు శ్రీనివాస్, చంద్రశేఖర్, మల్లమ్మ, మల్లేష్, జంగయ్య, చెంద్రయ్య తదితరులు ఉన్నారు.

మితిమీరిన వేగం.. తెచ్చింది ప్రమాదం

- కారును ఢీకొట్టిన క్రూజర్
- 12 మందికి తీవ్ర గాయాలు



నుజ్జునుజ్జయిన కారు డోర్లను లాగుతున్న ప్రయాణికులు



తీవ్రంగా గాయపడిన ఓ మహిళ

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై గునుగల్ గేట్ సమీపంలోని కృష్ణాజలాల రిజర్వాయర్ సమీపంలో అతి వేగంగా వస్తున్న క్రూజర్ ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టడంతో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి మాజీ సర్పంచ్ చిగురింత శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు సంపత్‌రెడ్డికి నగరంలో శనివారం ప్రమాదం జరిగింది. కొడుకును ఓ ప్రవేట్ ఆస్పత్రిలో చేర్పించి సోమవారం సాయంత్రం శ్రీనివాస్‌రెడ్డి తన తండ్రి రాంచంద్రారెడ్డి, తల్లి భారతమ్మ, పెద్దమ్మ జయమ్మ మరో బంధువుతో కలిసి కారులో బీఎన్‌రెడ్డి నగర్ నుంచి స్వగ్రామమైన నక్కర్తమేడిపల్లికి వస్తున్నారు. మార్గ మధ్యలో గునుగల్ గేట్ కృష్ణాజలాల రిజర్వాయర్ సమీపంలోని మలుపు వద్ద యాచారం నుంచి ఇబ్రహీంపట్నం వైపు వేగంగా వస్తున్న క్రూజర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్నవారు తీవ్రంగా గాయపడ్డారు. కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. కారులో ఉన్న బెలూన్లు తెరుచుకోవడంతో అంతా ప్రాణాలతో బయటపడ్డారు. అయితే కారు డోర్లు ఓపెన్ కాకపోవడంతో శ్రీనివాస్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు భయాందోళనతో కేకలు వేయగా ప్రయాణికులు బలవంతంగా కారు డోర్లు లాగి వారిని బయటకు తీశారు. క్రూజర్‌లో ఉన్న ఏడుగురికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సాంస్కృతిక సారథికి నంది అవార్డు


అవార్డు అందుకుంటున్న ప్రభాకర్

కందుకూరు: మండల పరిధి తిమ్మాపూర్‌కు చెందిన ప్రజా జానపద గాయకుడు, తెలంగాణ ఉద్యమ కళాకారుడు మంద ప్రభాకర్ నంది అవార్డు అందుకున్నారు. తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కళాకారులకు హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయ గాన సభలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేశారు. తెలంగాణ ఉద్యమ కళాకారుడిగా, సాంస్కృతిక సారథిగా ప్రభాకర్ చేసిన సేవలను గుర్తించి.. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సామేల్, సుప్రసిద్ధ నాటక, టీవీ, సినీ సంగీత దర్శకుడు రాజబాబు ఆయనకు నంది అవార్డుతో పాటు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ యువీ రత్నం, నిర్వాహకులు ధనరాజ్, ఉషారాణి తదితరులు మందను అభినందించారు.

న్యాయం జరగడం లేదు.. చావే శరణ్యం

- కోర్టు ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం
- నిలువరించిన పోలీసులు, కేసు నమోదు


ఆత్మహత్యకు యత్నించిన కమలాబాయి

ఇబ్రహీంపట్నం రూరల్: 'కోర్టుల చుట్టూ తిరిగినా న్యాయం జరగడం లేదు. నేను బతికి ఉండగా నా పిల్లలు ఆగమైపోతున్నారు. చావే శరణ్యం' అంటూ ఓ గిరిజన మహిళ న్యాయస్థానం ఎదుట ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం కోర్టు ఆవరణంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. యాచారం మండలం మంతన్‌గౌరెల్లి గ్రామం కేసీతండాకు చెందిన జర్పుల భద్రీయ కమలబాయి దంపతులు. భద్రియ మరో మహిళ పద్మను రెండో వివాహం చేసుకున్నాడు. దీంతో ఆమె చాలాకాలంగా వేరుగా ఉంటోంది. మొదటి భార్య కమలకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నాడు. రెండో భార్యకు ముగ్గురు కూతుర్లు ఉన్నారు. మొదటి భార్య పెద్ద కుమార్తె వివాహం అయింది. మరో కూతురు పెళ్లి కావాల్సి ఉంది. ఇదిలా ఉండగా.. రెండో భార్య అయిన పద్మ ముగ్గురు పిల్లల వివాహం భద్రీయ దగ్గరుండి జరిపించాడు. దీంతో మొదటి భార్య కమల తీవ్ర మనోవేదనకు గురైంది. భర్త పట్టించుకోవడం లేదంటూ.. రెండు ఎకరాల పొలం పిల్లలకు ఇవ్వాలని 2021లో ఇబ్రహీంపట్నం కోర్టులో కేసు వేసింది. కేసు కొనసాగుతుండగానే భద్రియ 20 గుంటల పొలం అమ్మేశాడు. మరో ఎకరాభూమిని విక్రయించడానికి బేరసారాలు కుదుర్చుకున్నాడు. దీంతో మనస్తాపం చెందిన ఆమె.. న్యాయంజరగడం లేదని, నియమించుకున్న న్యాయవాదులు కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తూ.. కోర్టు ఆవరణలో బలవన్మరణానికి యత్నించింది. గమనించిన పోలీసులు ఆమెను నిలువరింపచేశారు. అక్కడి నుంచి పట్నం పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కోర్టులో న్యాయం దక్కుతుందని చెప్పారు. కోర్టు ఎదుట ఇలాంటి పనులు చేయడం నేరమని పేర్కొంటూ ఆమెపై కేసు నమోదు చేశారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత!

- జోరుగా సాగుతున్న కలప అక్రమ రవాణా
- పట్టించుకోని అధికార యంత్రాంగం


ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలప


లింగస్‌పల్లి శివారులో చింత చెట్ల నరికివేత

బొంరాస్‌పేట: అటవీ ప్రాంతంలో అడ్డూఅదుపు లేకుండా చెట్ల నరికివేత కొనసాగుతుంది. కలప అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. పట్టపగలే వృక్షాలు విచ్చలవిడిగా నరికివేతకు గురవుతున్నప్పటికీ అటవీశాఖ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. తాజాగా మండల పరిధిలోని కొత్తూరు రేంజ్ పరిధిలో చెట్ల నరికివేత విచ్చలవిడిగా సాగుతోందని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. రేంజ్ పరిధిలోని కొత్తూరు, రేగడి మైలారం, లింగస్‌పల్లి, ఎన్కేపల్లితోపాటు పలు తండాల్లో అటవీ ప్రాంతంతోపాటు ప్రభుత్వ భూములు, వ్యవసాయ పొలాల్లో ఉన్న చెట్లు కోతకు నిత్యం గురవుతున్నాయి. అందులో ముఖ్యంగా చింత చెట్లను ఎక్కువగా వధిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు.

వ్యాపారుల ఇష్టారాజ్యం

మండంలలోని బొంరాస్‌పేట, రేగడిమైలారం, తుంకిమెట్ల, లింగస్‌పల్లి తదితర గ్రామాల్లో అనుమతి లేకుండా చెట్లను నరికివేసే వ్యాపారులున్నారు. ఇటీవల కట్టెల వ్యాపారులు పెరిగిపోయారు. అంతేకాకుండా యథేచ్ఛగా వృక్షాలను నరికివేస్తున్నారు. తుమ్మ, మామిడి, చింత, తదితర చెట్లు విచ్చలవిడిగా అక్రమ కలప రవాణాదారుల చేతుల్లో నరికివేతకు గురవుతున్నాయి.

లోపించిన పర్యవేక్షణ

అటవీశాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది నిఘా లేకపోవడంతో పట్టపగలే చెట్లను నరికివేసి రహదారుల గుండా కలప రవాణా జరుగుతోంది. ఇప్పటికైనా అటవీ అధికారులు, సిబ్బంది నిఘా పెంచి అక్రమ కలప రవాణా, చెట్ల నరికివేతను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. దీనిపై అటవీశాఖ సిబ్బందిని సంప్రదించగా ఫారెస్ట్ రేంజ్ అధికారి సవిత సెలవులో ఉందన్నారు.

చర్యలు తీసుకుంటాం

ఆన్‌లైన్ విధానంతో రైతు తమ పాస్‌బుక్, ఆధార్ కార్డులతో అనుమతులు తీసుకుంటున్నారు. కొన్ని చోట్ల అనుమతికి మించి నరికివేతలుంటున్నాయి. కొత్తూరు బీట్‌కు ఇద్దరు అధికారులు, కొడంగల్‌కు ఇద్దరు బీట్ అధికారులుండాలి. సిబ్బంది కొరత కారణంగా పర్యవేక్షణ ఇబ్బందిగా ఉంది. చెట్ల నరికివేతపై చర్యలు తీసుకుంటాం.

– రతన్‌సింగ్, సెక్షన్ అధికారి, కొడంగల్

అదృశ్యమైన వృద్ధురాలి హత్య


సత్యమ్మ (ఫైల్)

షాబాద్: అదృశ్యమైన ఓ వృద్ధురాలు హత్యకు గురైంది. ఈ సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండల పరిధి మన్‌మర్రి గ్రామానికి చెందిన జటని సత్యమ్మ(65) ఈ నెల 7న ఉదయం షాద్‌నగర్ ఆస్పత్రికి వెళ్తున్నాని ఇంట్లో చెప్పి వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో 8వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం షాద్‌నగర్ ఠాణా పరిధి రంగంపల్లి వద్ద వృద్ధురాలి మృతదేహం కనిపించడంతో.. కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందజేశారు. వారు అక్కడికి వెళ్లి చూసి సత్యమ్మగా గుర్తించారు. గుర్తు తెలియని దుండగులు ఆమె ఒంటిపై ఉన్న బంగారు నగల కోసం హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలి భర్త అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


చంద్రయ్య (ఫైల్)

షాబాద్: చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్‌కు చెందిన గడ్డం చంద్రయ్య(48) ఈ నెల 8న మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి రాలేదు. దీంతో అతడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. మిస్సింగ్ కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం స్థానిక పహిల్వాన్ చెరువులో వ్యక్తి మృతదేహం ఉందన్న సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. శవాన్ని బయటకు తీసి చంద్రయ్యగా గుర్తించారు. మృతుడి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మధుబన్ కాలనీలో వాహన తనిఖీలు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీలో సోమవారం సాయంత్రం వాహన తనిఖీలను చేపట్టారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై జయలక్ష్మి ఆధ్వర్యంలో తనిఖీలను నిర్వహించారు. హెల్మెట్ ధరించని, సీట్ బెల్ట్ వేసుకోని, లైసెన్స్ లేని వాహనాలతో పాటు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేస్తున్న వారిని పట్టుకుని చలానాలు విధించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


శ్యాంప్రసాద్ (ఫైల్)

మీర్‌పేట: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లెలగూడకు చెందిన పుస్తకాల శ్యాంప్రసాద్(40) ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేసి, రెండు నెలలుగా ఖాళీగా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పిల్లల స్కూలు ఫీజు చెల్లించే విషయంలో సోమవారం శ్యాంప్రసాద్ భార్య ప్రియాంకతో మాట్లాడుతూ బాధపడ్డాడు. అనంతరం భార్య వాష్‌రూమ్‌కు వెళ్లగా, శ్యాంప్రసాద్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు.

మనస్తాపంతో..


దేవి (ఫైల్)

కుత్బుల్లాపూర్ : పిల్లలు పుట్టి చనిపోతుండటం, భర్త మద్యానికి బానిస కావడంతో మనస్తాపానికి లోనైన ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది.. ఎస్సై పరమేశ్వర్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన దేవి (28) కోదండరామ్ దంపతులు సుభాష్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు పుట్టి పది నెలల వ్యవధిలోనే మృత్యువాత పడ్డారు. అప్పటి నుంచి డిప్రెషన్‌తో బాధపడుతున్న దేవి తరచూ భర్తతో గొడవ పడేది. ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చిన భర్తతో మరోసారి గొడవ పెట్టుకోవడంతో అతను ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపానికి లోనైన దేవి ఇంట్లో ఐరన్ రాడ్డుకు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తెల్లవారుజామున ఇంటికి వచ్చిన కోదండరామ్ దీనిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతురాలి సోదరుడు

బస్సు దిగుతూ కిందపడి మహిళకు తీవ్ర గాయాలు

కుషాయిగూడ: ఆర్టీసీ బస్సు దిగుతూ ప్రమాదవశాత్తు కింద పడటంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆలేరుకు చెందిన జయమ్మ ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉంటూ ఇళ్లల్లో పని చేస్తుంది. సోమవారం ఆమె ఆలేరు వెళ్లేందుకు ఈసీఐఎల్ బస్ స్టాప్‌కు వచ్చింది. ఘట్‌కేసర్ వైపు వెళుతున్న బస్సు అనుకుని అఫ్జల్‌గంజ్‌కు వెళ్లే కుషాయిగూడ డిపోకు చెందిన బస్సు ఎక్కింది. కండక్టర్ బస్సు ఘట్‌కేసర్ వెళ్లదని చెప్పడంతో ఆమె కదులుతున్న బస్సులోంచి కిందకు దిగింది. దీంతో అదుపుతప్పి కిందపడటంతో ఆమె ఎడమ చేతిపై నుంచి బస్సు చక్రాలు వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. డ్రైవర్ అజాగ్రత్త కారణంగానే ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డ్రైవర్ రామకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజావాణి వినతులను సత్వరమే పరిష్కరించాలి

లక్డీకాపూల్: ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్లు కదిరవన్ పలాని, డాక్టర్ ముకుంద రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వారు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 1561 దరఖాస్తులు అందాయని.. ఆయా అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల్లో పౌరసరఫరాల శాఖకు సంబంధించిన 743, గృహ నిర్మాణ శాఖకు సంబంధించి 735, పెన్షన్ 55, డీఈఓ 04 ఇతర శాఖలకు సంబంధించినవి 24 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ సాయిరాం, జిల్లా అధికారులు ఆర్. రోహిణి, పవన్‌కుమార్, కోటాజీ, డీఎంహెచ్‌ఓ వెంకటి, సుబ్రహ్మణ్యం, ఇలియాజ్ అహ్మద్, రాజేందర్, శ్రీరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి

చన్గోముల్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ

పూడూరు: రౌడీషీట్‌లు ఓపెన్ అయిన వారందరూ సత్ప్రవర్తనతో మెలగాలని చన్గోముల్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి సూచించారు. సోమవారం చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌లో రాబోయే పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో ప్రత్యక్షంగా ఉన్న రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. త్వరలో వచ్చే గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికల్లో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. గ్రామాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా గొడవలకు కారమైనట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్ప్రవర్తన ఉంటే రౌడీషీట్‌లను ఎత్తి వేసేందుకు వీలుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న పాఠశాల బస్సు

ముగ్గురికి గాయాలు


చేతికి గాయంతో చికిత్స పొందుతున్న విద్యార్థి సాత్విక్


తలకు గాయంతో ఆయమ్మ మంగమ్మ

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రైవేటు పాఠశాల బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ విద్యార్థితో పాటు ఆయమ్మ, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధి బొంగ్లూర్ సమీపంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్‌లోని నలంద గ్రామర్ హై స్కూల్‌కు చెందిన మినీ బస్సు.. దినచర్యలో భాగంగా సోమవారం ఉదయం చింతపల్లిగూడకు చెందిన విద్యార్థులతో పాఠశాలకు బయలుదేరింది. ఈ క్రమంలో కళ్లెం జంగారెడ్డి ఫంక్షన్ హాల్‌కు సమీపంలో అయిల్ మిల్ వద్దకు రాగానే, బస్సు అతివేగంతో డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అందులో ఉన్న 10 మంది విద్యార్థుల్లో మూడో తరగతి చదువుతున్న సాత్విక్ చేతికి బలమైన గాయం అయింది. ఆయమ్మ మంకాల మంగమ్మ తలకు తీవ్ర గాయమై రక్తస్రావం అయింది. డ్రైవర్ కిషన్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను తుర్కయంజాల్‌లోని ఆరోగ్య ఆస్పత్రికి తరలించారు. అయినప్పటికీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు స్పందించలేదని విద్యార్థి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇదే విషయమై పట్నం పోలీసులను వివరణ కోరగా.. ఘటనకు సంబంధించిన ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

వేలి ముద్రలు పట్టించాయి

ఘరానా దొంగ అరెస్ట్

- నిందితుడిపై పలు స్టేషన్ల పరిధిలో 15 కేసులు నమోదు
- ఆరేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నేపాలీ యువకుడు


నిందితుడు గోవిందు బండారి

బంజారాహిల్స్: ఆరేళ్లుగా పోలీసుల కళ్లుగప్పి తప్పించుకు తిరుగుతున్న ఘరానా దొంగను వేలి ముద్రల ఆధారంగా పోలీసులు పట్టుకున్నారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నేపాల్‌కు చెందిన గోవిందు బండారి అలియాస్ పదం బండారి(24) 2019లో జూబ్లీహిల్స్ రోడ్ నెం.18లో నివాసం ఉంటున్న పాయల్ శర్మ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డాడు. రూ. 50 వేల నగదు, డైమండ్ రింగ్, ఖరీదైన వాచ్ తదితరాలను చోరీ చేసి నేపాల్‌కు పారిపోయాడు. అతడి కోసం జూబ్లీహిల్స్ పోలీసులు గాలించినా ఫలితం లేకుండా పోయింది. అదే రోజు అతను రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బ్యాంకులో చోరీకి విఫలయత్నం చేశాడు. ఈ రెండు కేసుల్లోనూ పోలీసులు నిందితుడి వేలి ముద్రలను సేకరించారు. ఇదిలా ఉండగా తనను హైదరాబాద్ పోలీసులు మర్చిపోయి ఉంటారని భావించిన బండారి 2024లో నగరానికి వచ్చి నేరాలకు పాల్పడుతున్నాడు. ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 51 సెల్‌ఫోన్లు చోరీ చేసిన అతడిని గత ఏడాది పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆ కేసులో అతడి వేలి ముద్రలు సేకరించిన ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు వెస్ట్‌జోన్ ఫింగర్ ప్రింట్స్ బ్యూరోకు పంపారు. వాటిని పరిశీలించిన నిపుణులు 2019లో జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలో జరిగిన చోరీ కేసులో లభ్యమైన వేలిముద్రలతో సరిపోల్చారు. ఆర్‌సీపురం పరిధిలో జరిగిన బ్యాంకు చోరీ యత్నం కేసులోనూ అతడిని నిందితుడిగా గుర్తించారు. ఫింగర్ ప్రింట్స్ బ్యూరో ఇచ్చిన సమాచారం మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ఇటీవల ఎస్‌ఆర్‌నగర్ సెల్‌ఫోన్ల కేసులో బెయిల్‌పై విడుదలైన గోవిందును సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతడిపై కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, జీడిమెట్ల, ఆర్సీపురం, జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌తో పాటు ఎస్‌ఆర్‌నగర్ పరిధిలోనూ కేసులు ఉన్నట్లు గుర్తించారు. 15 కేసుల్లో వాంటెడ్‌గా ఉన్న అతను ఆరేళ్లుగా పోలీసుల కళ్లుగప్పి తప్పించుకు తిరుగుతున్నాడన్నారు. ఆయా చోరీల్లో గోవిందుకు సహకరించిన అతడి సహ నిందితుడు డార్జిలింగ్‌కు చెందిన రాజేష్ ఛత్రి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

శోభాయమానంగా విగ్రహ ప్రతిష్ఠాపన

ముగిసిన ఓంకారేశ్వర స్వామి ఉత్సవాలు


ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో భక్తజనం

కుల్కచర్ల: మండల కేంద్రంలో రెండు రోజులుగా కొనసాగుతున్న ఓంకారేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజారోహణ కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం హోమంతో పాటు ఓంకారేశ్వర విగ్రహ ఏర్పాటు, వీరభద్రస్వామి, నంది తదితర దేవతామూర్తులను ప్రతిష్ఠించి ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సతీమణి ఉమారామ్మోహన్‌రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. మహారాష్ట్ర దుదుని, ఆలంపల్లి మఠాధీశులు చెన్నబసవ ప్రభు ఆధ్యాత్మిక అంశాలపై ప్రవచనాలు చేశారు. డీసీసీ ఉపాధ్యక్షులు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులుముదిరాజ్, బీ-బ్లాక్ అధ్యక్షుడు భరత్‌కుమార్, నాయకులు రాజప్ప, బాలముకుందం, సురేష్, స్వామి, ప్రకాష్, సతీష్, ప్రేమ్‌కుమార్, రవిచందర్, రాజశేఖర్, రాజు, హరికృష్ణ పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు అందజేసిన భారతి సిమెంట్స్

ఓంకారేశ్వర స్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ఏర్పాటు కార్యక్రమం కొనసాగింది. ఇందులో భారతి సిమెంట్స్ సేవా దృక్పథాన్ని చాటుకుంది. ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు భారీగా మజ్జిగ ప్యాకెట్లను అందజేసింది. ఈ కార్యక్రమంలో భారతి సిమెంట్స్ టెక్నికల్ ఆఫీసర్ సామ్రాట్, అసిస్టెంట్ సేల్స్ మేనేజర్ వీరాంజనేయరెడ్డి, డీలర్లు శ్రీకాంత్, సందీప్, స్థానిక నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఆంజనేయులుముదిరాజ్, భరత్‌కుమార్, హరికృష్ణ, రాఘవేందర్‌గౌడ్, ప్రకాష్, సతీష్, రాజేశ్వర్, భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష

షాబాద్: స్నేహితుల మధ్య జరిగిన గొడవలో ఓ వ్యక్తిని హత్య చేసిన సంఘటనలో నిందితుడికి పదేళ్లు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. 2021 సంవత్సరంలో షాబాద్ మండల పరిధి లక్ష్మారావుగూడ గ్రామ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్ వద్ద స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణలో ముసిరి రమేష్, నర్సింహులు కలిసి మరో వ్యక్తిని హత్య చేశారు. అప్పట్లో వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తర్వాత ముసిరి రమేష్ మృతి చెందాడు. నేరం రుజువుకావడంతో నర్సింహులుకు పదేళ్ల జైలు శిక్షతో పాటు, రూ.15 వేలు జరిమానా విధిస్తూ సోమవారం ఎల్బీనగర్ అదనపు కోర్టులో న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ కేసులో అప్పటి సీఐ అశోక్‌తో పాటు ప్రస్తుత సీఐ కాంతారెడ్డి, రఘు, సత్యనారాయణ, సిబ్బంది వెంకటేష్, ప్రభాకర్, జంగయ్యలు చూపిన తగిన ఆధారాలతో నేరం రుజువై.. నిందితుడికి జైలు శిక్ష పడినట్లు సీఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

షాబాద్: గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి సంకెపల్లిగూడ గ్రామానికి చెందిన కుమ్మరి చంద్రకళ ఇళ్లు గ్రామ సమీపంలోని మసీదు వద్ద ఉంటుంది. ఈ నెల 9న ఉదయం తన కోడలు, పిల్లల ఆరోగ్యం బాగలేకపోవడంతో షాద్‌నగర్ ఆస్పత్రికి వెళ్లారు. సాయంత్రం 4 గంటలకు ఇంటికి వచ్చి, తాళం తీసి చూడగా.. ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడున్నాయి. బీరువాలో ఉన్న పుస్తెలతాడు, చైను, కమ్మలు, పట్టగొలుసులు, నగదుతో పాటు.. టీవీ అపహరణకు గురైనట్లుగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీసీల అభ్యున్నతికి ప్రాధాన్యత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ బీసీ మహాసభ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని సోమవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో బీసీలు 65శాతం మంది ఉన్నారని, వారు ఆర్థిక, సామాజిక, విద్యా, రాజకీయ రంగాల్లో మరింతగా రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇటీవల కులగణన చేపట్టిందని, బీసీలకు తగిన రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. వెనుకబడిన బీసీల కోసం మహాసభ ఎంతో కృషి చేస్తుందని, వారిని చైతన్య పరిచేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతుందని వెల్లడించారు. చట్టసభల్లో తగిన రిజర్వేషన్ సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా యువత అధ్యక్షుడు శ్రీధర్‌వర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, నాయకులు సదానంద్ ఉన్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

అత్తాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్సై ఎస్.బాలకిషన్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ ఎలివేటెడ్ వే పిల్లర్ నంబర్ 161 సమీపంలో వ్యక్తి మృతదేహం (55) ఉందని పోలీసులకు సమాచారం అందిందన్నారు. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా అప్పటికే మరణించి ఉన్నాడన్నారు. మృతుడి వివరాలు తెలుసుకునేందుకు స్థానికంగా వాకబు చేసిన ఎలాంటి సమాచారం అందలేదన్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు.